సాక్షి ఆదిలాబాద్

మంగళవారం ı 11 ı మార్చి ı 2025



అథ్లెటిక్స్‌లో మెరిశారు..
ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు అథ్లెటిక్స్‌లో మెరిశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తూ సత్తా చాటుతున్నారు. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళవారం: 6:21	బుధవారం: 5:11

గరిష్టం/కనిష్టం
37.0/21.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



దివ్యాంగులకు ఉపకరణాలు అందజేస్తూ..

ఆదిలాబాద్‌టౌన్: వైకల్యం గల పిల్లలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని డీఈవో ప్రణీత అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో అలింకో, విద్యాశాఖ ద్వారా దివ్యాంగులకు సోమవారం ఉపకరణాలు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 123 మంది చిన్నారులకు సీపీ చైర్, కృత్రిమ అవయవాలు, ఎలక్ట్రిక్ ట్రైసైకిల్, వినికిడి యంత్రాలు, రోలేటర్ తదితర పరికరాలను అందించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ,దివ్యాంగులు సకలాంగులతో సమానంగా పోటీ పడుతున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు సుజాత్ ఖాన్, శ్రీకాంత్‌గౌడ్, ఎంఈవోలు సోమయ్య, శ్రీనివాస్,హెచ్‌ఎంలు లచ్చిరాం, లక్ష్మణ్, డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట సీపీఐ ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు, కాలనీవాసులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ రూరల్ మండలం నిషాన్‌ఘాట్‌లోని సర్వేనంబర్ 38లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ మాట్లాడుతూ, కాలనీలో ఎనిమిదేళ్లుగా నిరుపేదలు అంధకారంలో ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. కలెక్టర్ చొరవ చూపి కాలనీలో విద్యుత్ సౌకర్యంతో పాటు తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో పార్టీ నాయకులు గంగారెడ్డి, దేవిదాస్, కేశవ్, కృష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.

'స్పాట్' రెమ్యూనరేషన్ చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న సంఘ బాధ్యులు

ఆదిలాబాద్‌టౌన్: 2024లో నిర్వహించిన ఎస్సెస్సీ స్పాట్ వాల్యుయేషన్‌కు సంబంధించిన రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) జిల్లా అధ్యక్షుడు రామగిరి శివకుమార్ అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రెమ్యూనరేషన్ చెల్లించని పక్షంలో ఈ సారి స్పాట్ విధులు బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఇందులో సంఘం ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి విద్యాసాగర్‌రెడ్డి ఉన్నారు.

'పార్టీ నాయకులు రాకుండా ఆదేశాలివ్వండి'

కైలాస్‌నగర్:అధికారిక కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు పాల్గొనకుండా ఆదేశాలు జారీ చేయాలని కాంగ్రెస్‌పార్టీకి చెందిన మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు కలెక్టర్‌ను కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో ఆయనను కలిసి వినతిపత్రంఅందజేశారు. మూడు రోజుల క్రితం ఎమ్మెల్యే పాయల్ శంకర్ నిర్వహించిన ఆదిలాబాద్ మున్సిపల్ సమీక్ష సమావేశంలో బీజేపీ కార్యకర్తలు కూర్చున్నారన్నారు. అధికారిక కార్యక్రమాల్లో ఓ పార్టీ కార్యకర్తలు కూర్చోవడం సమంజసం కాదన్నారు. గతంలోనూ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలోనూ ఆ పార్టీ కార్యకర్తలు కూర్చున్నారని పేర్కొన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా తగు ఆదేశాలు జారీ చేయాలని, వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, మాజీ కౌన్సిలర్లు శ్రీనివాస్, నర్సింగ్, సతీశ్, లక్ష్మణ్, వెంకన్న తదితరులున్నారు.

ఏటీఎంలా.. ఏజెన్సీలు!



- నిర్వాహకులు, అధికారులకు కల్పతరువులా 'ఔట్‌సోర్సింగ్'
- కొత్త ఎంప్యానల్‌మెంట్‌ను మరిచిన యంత్రాంగం
- ఐదేళ్లుగా పాత వాటికే వర్క్ ఆర్డర్ల రెన్యూవల్
- కొత్త పోస్టులు మంజూరైనా వాటికే అప్పగింత!

ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల వివరాలు..

ఎంప్యానల్‌మెంట్ గుర్తించిన సంవత్సరం : 2019–20
ఎంప్యానల్‌మెంట్‌లో ఉన్న ఏజెన్సీలు : 17
యాక్టీవ్‌గా ఉన్న ఏజెన్సీలు : 09
వివిధ శాఖల్లో ఔట్‌సోర్సింగ్ పోస్టులు : (సుమారు) 1250

సాక్షి,ఆదిలాబాద్: ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు.. ఇటు నిర్వాహకులకు, అటు అధికారులకు ఎనీ టైమ్ మనీలా మారిపోయాయి. దీంతో ప్రస్తుతం కొనసాగుతున్న వాటిని ఆ శాఖలు వదులుకోవడం లేదు. ఐదేళ్లుగా వాటికే వర్క్ ఆర్డర్లు ఇస్తూ రెన్యూవల్ చేస్తున్నారు. కొత్త పోస్టులు మంజూరైనా వాటికే పంచేస్తున్నారు. సాధారణంగా ఏటా లేనిపక్షంలో రెండేళ్లకోసారి ఏజెన్సీల మార్పు చేపట్టాలి. ఇందుకోసం కొత్త ఎంప్యానల్‌మెంట్ రూపొందించాలి. అయితే ఈ ప్రక్రియకు ఐదేళ్లుగా బ్రేక్ పడడం గమనార్హం.

ఐదేళ్ల క్రితం ఏర్పాటైనవే..

ప్రభుత్వ శాఖల్లో ఔట్‌సోర్సింగ్ సర్వీసులను ఏజెన్సీలు చేపడతాయి. ఆ ఏజెన్సీలకు వీటి నియామక ప్రక్రియ అప్పగించేందుకు ముందుగా అవి ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందాలి. దాన్నే ఎంప్యానల్‌మెంట్ అంటారు. 2019–20 సంవత్సరంలో దీనికి సంబంధించి టెండర్లు నిర్వహించి ఏజెన్సీలను గుర్తించారు. ఆ తర్వాత ఏటా వాటి గడువు పొడగిస్తూనే ఉన్నారు. ఇప్పటికి ఐదేళ్లవుతుంది. ఔట్‌సోర్సింగ్ కమిటీ చైర్మన్ అయిన కలెక్టర్‌కు ఈ టెండర్ల నిర్వహణకు సంబంధించి విచక్షణ అధికారాలు ఉంటాయి. జిల్లాలో ఎంప్యానల్‌మెంట్ నుంచి మొదలుకొని వర్క్ ఆర్డర్.. ఇలా ప్రతీ అంశంలో గతంలో అక్రమాలు వెలుగు చూశాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడున్న ఎంప్యానల్‌మెంట్ రద్దు చేసి కొత్తగా టెండర్లు చేపట్టి దీన్ని గాడిలో పెట్టేందుకు ఏవైన చర్యలు తీసుకుంటారా అనేది చూడాల్సిందే.

అడ్డూ అదుపులేని ఏజెన్సీల అక్రమాలు..

గతంలో బీసీ సంక్షేమ శాఖలో అక్షర ఏజెన్సీకి సంబంధించి అక్రమం వెలుగు చూసింది. ఇందులో కింది స్థాయి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులైన కుక్, వాచ్‌మెన్, తదితర ఉద్యోగులకు సంబంధించి ఈ ఏజెన్సీ నెలల తరబడి వేతనాలు చెల్లించకుండా, అటు వారికి సంబంధించి పీఎఫ్ కట్టకుండా ప్రభుత్వం నుంచి లక్షల రూపాయల బిల్లులను డ్రా చేసుకున్నారు. ఈ వ్యవహారాన్ని అప్పట్లో 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. అయితే విస్తుపోవాల్సిన అంశం ఏమిటంటే.. ఆ అక్షర ఏజెన్సీ అసలు ఎంప్యానల్‌మెంట్ జాబితాలోనే లేదు. ఇకపోతే ఇటీవల రిమ్స్‌లోనూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల నియామకాల విషయంలో నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్న విమర్శలు కూడా వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో పాత ఏజెన్సీల అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది.

అప్పట్లో ఎంప్యానల్‌మెంట్‌లో 17 ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను గుర్తించారు. వాటికి మాత్రమే వర్క్ ఆర్డర్ ఇవ్వాలి. మధ్యలో వీటి సంఖ్య 20కి పెరిగినట్లు విమర్శలు వ్యక్తమయ్యాయి. కొత్త ఎంప్యానల్‌మెంట్ ఏర్పాటయ్యే వరకు పాత వాటిలో ముందుగా గుర్తించిన ఏజెన్సీలను మినహాయిస్తే మిగతా వాటిని చేర్చేందుకు ఆస్కారం ఉండదు. అయితే జిల్లాలో గతంలో ఉపాధికల్పన శాఖ అధికారులుగా చేసిన వారు పలు అక్రమాలకు పాల్పడ్డారనే విమర్శలు ఉన్నాయి. ఇలా అదనంగా ఏజెన్సీలు ఎలా పుట్టుకొచ్చాయన్నది జిల్లా ఔట్‌సోర్సింగ్ కమిటీకి తెలిసే జరిగిందా.. తెలియక జరిగిందా.. అనే సందేహాలు వ్యక్తమయ్యాయి.

ఎంప్యానల్‌మెంట్‌లో లేని వాటికి వర్క్‌ఆర్డర్..?

గతంలో ఏసీబీ దాడుల్లో ఉపాధికల్పన శాఖ అధికారులు పట్టుబడ్డారు. ఓ ఏజెన్సీకి వర్క్ ఆర్డర్ ఇచ్చే విషయంలో రూ.2.25 లక్షలు లంచం తీసుకుంటూ దొరికిపోయారు. అప్పటి నుంచే జిల్లాలో ఉన్న ఎంప్యానల్‌మెంట్, వివిధ ప్రభుత్వ శాఖల్లో అస్తవ్యస్తంగా ఉన్న ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల నిర్వహణ తీరును కమిటీ గాడిలో పెట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటుందని నిరుద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఏళ్లుగా ఉన్న ఈ ఎంప్యానల్‌మెంట్‌ను రద్దు చేసి కొత్తది ఏర్పాటు చేసి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల కల్పనలో అర్హులైన నిరుద్యోగులకు ఆసరగా నిలవాలన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

కొత్త ఎంప్యానల్‌మెంట్ ఏర్పాటుకు చర్యలు..



కొత్త ఎంప్యానల్‌మెంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. విధివిధానాలు రూపొందిస్తున్నాం. పాత దాని గడువు ఈ మార్చి 31తో ముగిసిపోతుంది. సాధారణంగా ఎంప్యానల్‌మెంట్ గడువు కొన్ని జిల్లాల్లో ఏడాది, మరికొన్ని జిల్లాలో రెండేళ్ల పాటు ఉంటుంది. జిల్లాలో కొన్నేళ్లుగా పాత ఎంప్యానల్‌మెంటే కొనసాగుతుంది. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ప్రక్రియ చేపడతాం.

–మిల్కా, ఉపాధికల్పనశాఖ ఇన్‌చార్జి అధికారి

నేరాల నియంత్రణపై ఫోకస్

- ట్రాఫిక్ సమస్యలు, శాంతిభద్రతలపై నిఘా
- సంఘవిద్రోహ శక్తుల కట్టడికి చర్యలు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో నూతన ఎస్పీ అఖిల్ మహాజన్



అఖిల్ మహాజన్, ఎస్పీ ఆదిలాబాద్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో నేరాల అదుపు, శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతానని జిల్లా నూతన ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఎస్పీగా సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు. ఆయన మాటల్లోనే..

సాక్షి: సర్, గుడ్‌మార్నింగ్.. వెల్‌కం ఆదిలాబాద్. మీ నేపథ్యం, ఐపీఎస్ శిక్షణ.. ఇప్పటివరకు ఏయేప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు?

ఎస్పీ: స్వస్థలం వచ్చి కశ్మీర్. పాఠశాల విద్య అక్కడే సాగింది. ఆ తర్వాత హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో పట్టభద్రుడిని అయ్యాను. అమ్మ ఊర్మిళ గృహిణి. నాన్న రాకేశ్ వ్యాపారి. భార్య దివ్యాన్షి డాక్టర్. నాది 2017 ఐపీఎస్ బ్యాచ్. మొదటగా సిద్దిపేటలో శిక్షణ పూర్తి చేశాను. తర్వాత మంచిర్యాల ఏసీపీ, డీసీపీగా పెద్దపల్లి, రామగుండం డీసీపీగా, సిరిసిల్ల ఎస్పీగా పనిచేశాను.

సాక్షి: జిల్లాలో మాదకద్రవ్యాలు, పేకాట నిర్మూలనకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు..?

ఎస్పీ: మాదకద్రవ్యాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడతాం. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదు. యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలి.విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దు. ఎవరైనా గంజాయి, డ్రగ్స్ సరఫరా చేస్తే సమాచారం అందించాలి. క్రైమ్ రేట్‌ను తగ్గించడమే లక్ష్యంగా ముందుకు సాగుతాం. గుట్కా, మట్కా, పేకాటపై దృష్టి సారిస్తాం.

సాక్షి: మీ ప్రాధాన్యత అంశాలు..?

ఎస్పీ: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. నేరాలను అదుపులో ఉంచేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తాం. అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా చూస్తాం. సరిహద్దు ప్రాంతాల్లో కట్టుదిట్టమైన నిఘాతో పాటు సంఘవిద్రోహ శక్తుల కట్టడికి కృషి చేస్తాం. రౌడీ షీటర్లపై నిఘాతో పాటు ప్రజలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా అవగాహన కార్యక్రమాలు చేపడతాం.

సాక్షి: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ఎలాంటి చర్యలు చేపడతారు..?

ఎస్పీ: విషయం నా దృష్టికి వచ్చింది. ట్రాఫిక్ పోలీసులు, అధికారులతో సమావేశం నిర్వహించి ప్రత్యేక చర్యలు చేపడతాం. అంతేకాకుండా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటాం.తల్లిదండ్రులు కూడా మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారిస్తాం. బ్లాక్‌స్పాట్లను గుర్తించి అవసరమైన చర్యలు చేపడతాం.

సాక్షి: మహిళల భద్రత కోసం ఎలా ముందుకెళ్తారు..?

ఎస్పీ: మహిళల భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపడతాం. షీటీంల ద్వారా మహిళలు, యువతులు, విద్యార్థినులకు అవగాహన కల్పిస్తాం. అవసరమైతే అదనంగా బృందాలను ఏర్పాటు చేస్తాం. పోకిరీలు వేధిస్తే డయల్ 100కు సమాచారం అందించాలి. తక్షణమే పోలీసులు అక్కడికి చేరుకొని బాధితులకు న్యాయం జరిగేలా చూస్తాం. నేరాల నియంత్రణకు పెట్రోలింగ్, గస్తీ ముమ్మరం చేస్తాం.

సాక్షి: జిల్లా కేంద్రంలో పలుచోట్ల సీసీ కెమెరాలు పనిచేయట్లేదు. దొంగతనాలు, ప్రమాదాలు జరిగిన సమయంలో గుర్తించలేని పరిస్థితి ఉంది. ఎలాంటి చర్యలు చేపడతారు?

ఎస్పీ: జిల్లాకేంద్రంలోని అన్ని చౌక్‌లు, ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు పనిచేసేలా చూస్తాం. అవసరమైన వాటికి మరమ్మతులు చేయిస్తాం. దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాల నివారణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహద పడతాయి. ప్రజలు, వ్యాపారులు వీటి ఏర్పాటు కోసం స్వచ్ఛందంగా ముందుకు రావాలి. సంఘటనలు జరిగినప్పుడు పోలీసు దర్యాప్తు సులువు అవ్వడంతో పాటు ఫుటేజీ ఆధారంగా ఉంటుంది.

సాక్షి: మావోయిస్టుల కదలికలపై ఎలాంటి దృష్టి సారిస్తారు..?

ఎస్పీ: జిల్లాలో మావోయిస్టుల ప్రభావం అంతగా లేదు. అయినప్పటికీ వారి కదలికలపై చర్యలు చేపడతాం.అమాయక గిరిజన యువత అటువైపు ఆకర్షితులు కాకుండా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తాం. వారికి ఉపాధి అవకాశాలు కల్పించేలా చూడడంతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తాం.

బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ..

నూతన ఎస్పీ అఖిల్ మహాజన్ స్థానిక పోలీసు కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయనకు పోలీసులు గౌరవ వందనం చేశారు. ఇక్కడ ఎస్పీగా పనిచేసి కరీంనగర్ సీపీగా బదిలీపై వెళ్తున్న గౌస్ ఆలం నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఎస్పీ అఖిల్ మాట్లాడుతూ.. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ ధ్యేయమన్నారు. ఇందులో అదనపు ఎస్పీ సురేంద్రరావు, డీఎస్పీలు శ్రీనివాస్, జీవన్ రెడ్డి,నాగేందర్,హసీబుల్లా తదితరులున్నారు.



ఎస్పీ అఖిల్ మహాజన్‌కు పూలమొక్క అందజేస్తున్న గౌస్ ఆలం

పూలే దంపతులను భారతరత్నతో గౌరవించాలి

- మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే

ఆదిలాబాద్‌రూరల్: సావిత్రిబాయి పూలే, మహాత్మ జ్యోతిబా పూలే దంపతులకు భారతరత్న ప్రకటించి గౌరవించాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే అన్నారు. సావిత్రిబాయి పూలే వర్ధంతిని జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయ ఆవరణలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మహిళా విద్య కోసం జ్యోతిరావు పూలే దంపతులు చేసిన కృషిని కొనియాడారు. ప్రభుత్వం వారి సేవలను గుర్తించి భారతరత్నతో గౌరవించాలన్నారు. ఇందులో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న, కోశాధికారి సతీశ్ గురుణులే, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఉమేశ్‌రావు డోలే, మాలీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు అనిల్, శ్రీను ఆచారి, హరీశ్, భాస్కర్ నందిని, తదితరులున్నారు.



నివాళులర్పిస్తున్న మాలీ సంఘం నాయకులు

వినతుల వెల్లువ

- గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరించిన కలెక్టర్
- పరిష్కరించాలని అధికారులకు ఆదేశం

కైలాస్‌నగర్: ప్రజా సమస్యలపై వినతులు వెల్లువెత్తాయి. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు జిల్లా నలుమూలల నుంచి బాధితులు తరలివచ్చారు. కలెక్టర్ రాజర్షి షా ఎదుట తమ గోడు విన్నవించి అర్జీలు సమర్పించారు. వారి సమస్యలను ఓపిగ్గా ఆలకించిన కలెక్టర్ దరఖాస్తులను ఆయా శాఖల అధికారులకు అందజేశారు. పెండింగ్‌లో ఉంచకుండా సత్వరం పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ వారం వివిధ సమస్యలకు సంబంధించి 90 అర్జీలు అందాయి. అందులో కొందరి నివేదన వారి మాటల్లోనే..



బాధితుల సమస్యలను ఆలకిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

• రుణమాఫీకి దూరమయ్యాం..



అయ్యా మాది జైనథ్ మండలంలోని మాకోడ గ్రామం. బేల మండలంలోని సిర్సన్న తెలంగాణ గ్రామీణ బ్యాంకులో మాకు అకౌంట్లు ఉన్నాయి. మా కుటుంబాలు వేరు. రేషన్‌కార్డులు వేర్వేరు. కానీ బ్యాంకు అధికారులు మా ఇద్దరి బ్యాంకు ఖాతాలకు ఒకే ఆధార్ నంబర్ లింక్ చేశారు. దీంతో రూ.లక్షన్నర లోపే పంట రుణం తీసుకున్నప్పటికీ ఒకే ఆధార్ ఉండటంతో ప్రభుత్వం నుంచి మాకు రుణమాఫీ అందలేదు. బ్యాంకు అధికారులను అడిగితే తప్పు జరిగినట్లుగా చెబుతున్నారు కానీ రుణమాఫీ తమ చేతుల్లో లేదంటున్నారు. న్యాయం చేయాలని కోరుతున్నాం.– **తమ్మల గంగమ్మ, గంగుబాయి**

• సిమెంట్, ఇనుము ప్రభుత్వమే అందించాలి

సార్.. మేమంతా జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారులం. ప్రభుత్వం తొలి విడతగా మా గ్రామాన్ని ఎంపిక చేసింది. 30 కుటుంబాలకు ఇళ్లను మంజూరు చేసింది. పునాదులు కూడా తవ్వుకున్నాం. అయితే మేమంతా కూలీనాలి చేసుకునే నిరుపేదలం. ఇంటి నిర్మాణ సామగ్రి కొనుగోలుకు మా వద్ద నయా పైసా లేదు. మాపై దయచూపి ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇనుము, సిమెంట్‌ను ప్రభుత్వపరంగా అందించేలా చర్యలు తీసుకుని ఆదుకోవాలి.

– **ఇందిరమ్మ లబ్ధిదారులు, పిప్పర్‌వాడ**



• తప్పుడు పట్టాతో అసెస్‌మెంట్ చేశారు



సార్.. మా అమ్మ జీనత్ బేగం పేరిట గత కాంగ్రెస్ ప్రభుత్వం 2013లో సర్వే నంబర్ 170లో ఇంటి పట్టా జారీ చేసింది. ఆదిలాబాద్ తహసీల్దార్ జారీ చేసిన ఒరిజినల్ పట్టా మా వద్దే ఉంది. అయితే కొంత మంది వ్యక్తులు తప్పుడు పట్టా సృష్టించి మున్సిపాలిటీ నుంచి అసెస్‌మెంట్ కూడా పొందారు. మేము ఇల్లు కట్టుకునేందుకు వెళితే బెదిరింపులకు గురిచేస్తూ రానివ్వడం లేదు. దీనిపై విచారణ జరిపించి అక్రమంగా జారీ చేసిన అసెస్‌మెంట్ రద్దు చేసి మాకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నాం.

– **జమీర్ అహ్మద్, పంజేషాకాలనీ, ఆదిలాబాద్**

• ఆ భూ కేటాయింపు రద్దు చేయాలి



జిల్లా కేంద్రంలోని న్యూ అంబేడ్కర్‌భవన్ ఎదుట గల ఓల్డ్ ఎన్‌సీఎల్‌పీ కార్యాలయం ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించిన స్థలంలోనే ఉంది. భవనం నిరుపయోగంగా ఉందనే ఉద్దేశంతో దాన్ని సీనియర్ సిటిజన్ అసోసియేషన్‌కు కేటాయించారు. దీంతో అంబేడ్కర్‌భవన్‌లో జరిగే సభలు, సమావేశాలు, ఫంక్షన్లు, శుభాకార్యాలకు ఆటంకంగా మారుతోంది. కనుక ఆ భూ కేటాయింపు రద్దు చేయాలి. – **అంబేడ్కర్ సంఘాల జేఏసీ నాయకులు, ఆదిలాబాద్**

• సెల్ టవర్ నిర్మాణ పనులు ఆపాలి

ఆదిలాబాద్‌లోని వార్డునంబర్ 12 న్యూహౌసింగ్‌బోర్డు జోన్ 2 పరిధిలో సెల్‌టవర్ నిర్మాణాన్ని అక్రమంగా చేపడుతున్నారు. గతంలో పనులు ప్రారంభించగా ఆందోళన చేయడంతో వాటిని నిలిపివేసి సామగ్రిని తరలించారు. మళ్లీ ఇటీవల ప్రారంభించారు. టవర్ నిర్మాణం నివాసాల మధ్య ఉండటంతో రేడియేషన్ కారణంగా దుష్పరిణమాలు ఎదురయ్యే ప్రమాదముంది. పనులు నిలివేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. – **న్యూహౌజింగ్‌బోర్డు కాలనీవాసులు, ఆదిలాబాద్**



వేధింపులా..'181'కు కాల్ చేయండి



మొక్కనాటి నీరు పోస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: వేధింపులకు గురయ్యే మహిళలు హెల్ప్‌లైన్ 181కు కాల్ చేసి లేదా www.shebox.nic.in వెబ్‌సైట్ ద్వారా లేదా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక పరిష్కార చట్టం–2013పై కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ చట్టంపై ప్రతీ మహిళ అవగాహన కలిగి ఉండాలన్నారు. వేధింపులను నియంత్రించడంలో భాగంగా ఫిర్యాదు చేసేందుకు ప్రతీ కార్యాలయంలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చట్టం ఆవశ్యకతను తెలిపే పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలోని ఫ్రీడం పార్కులో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్యతో కలిసి మొక్కలు నాటి నీళ్లు పోశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, ఆర్డీవో వినోద్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ అభిగ్యాన్, జిల్లా సంక్షేమాధికారి మిల్కా తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌కు హాజరైన కలెక్టర్..

రంజాన్ మాసంలో ముస్లింలు నియమనిష్ఠలతో కఠిన ఉపవాస వ్రతం ఆచరిస్తారని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఎస్‌వో వాజిద్ అలీ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, డీఎల్పీవో ఫణీంద్రరావు, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లారీడ్రైవర్‌కు 18నెలల జైలు

మందమర్రిరూరల్: లారీని అజాగ్రత్తతో నడిపి కానిస్టేబుల్ మృతికి కారణమైన లారీ డ్రైవర్ సుధాకర్‌రెడ్డికి 18 నెలల జైలుశిక్ష తోపాటు రూ.8 వేల జరిమానా విధిస్తూ మంచిర్యాల జిల్లా అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉపనిషద్వని సోమవారం తీర్పు చెప్పారు. మందమర్రి ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. మందమర్రిలోని అందుగుల పేట సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల వద్ద జాతీయ రహదారిపై 2016, అక్టోబర్ 5న కానిస్టేబుల్ జక్కని శ్రీధర్ బైక్‌పై వెళ్తున్నాడు. డ్రైవర్ అజాగ్రత్తగా లారీ నడిపి బైక్‌ను ఢీకొట్టగా శ్రీధర్ మృతిచెందాడు. మృతుడి తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసి 15 మంది సాక్షులను ప్రవేశ పెట్టి పీపీ వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో శిక్ష ఖరారు చేస్తూ మేజిస్ట్రేట్ తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్ష పడేలా చేసిన కోర్టు డ్యూటీ ఆఫీసర్లు మధుసూదన్, సురేందర్, లైజనింగ్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లను సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్ అభినందించారు.

చెరువులో మునిగి మనుబోతు మృతి!



మనుబోతు కళేబరం

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్‌-పాత తర్లపాడ్ మార్గమధ్యలోని చింతల చెరువులో పడి మనుబోతు మృతిచెందింది. దుర్వాసన రావడంతో ఈ విషయం సోమవారం ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికులు అందించిన సమాచారంతో అటవీ అధికారులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. గ్రామ శివారులోని అటవీ ప్రాంతం నుంచి నీరు తాగేందుకా, కుక్కలు వెంటాడితే వచ్చి నీట మునిగి చనిపోయి ఉంటుందని ఎఫ్ఆర్వో కిరణ్ తెలిపారు. అనంతరం జంతువుకు పోస్టుమార్టం నిర్వహించి, ఈ మేరకు విచారణ చేపట్టామన్నారు.

రౌడీషీటర్‌పై దాడి

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలోని శివాజీ గ్రౌండ్‌లో రౌడీషీటర్ ఎర్రగుంటపల్లి సంపత్‌పై గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి దాడి చేశారు. తీవ్రగాయాలైన అతన్ని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. సంపత్‌పై గతంలో పలు భూవివాదాలు, ఇతర కేసులు ఉన్నాయి. దాడికి పాల్పడిన వ్యక్తుల ఎవరనేది తెలియరాలేదు. ఈ విషయమై సీఐ ప్రమోద్‌రావును వివరణ కోరగా, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

చెన్నూర్‌లో చైన్ స్నాచింగ్



సీసీ ఫుటేజీలో రికార్డు అయిన సర్కిల్‌లో ఉన్న వ్యక్తి

చెన్నూర్: మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి లాక్కెళ్లాడు. సీఐ రవీందర్ కథనం ప్రకారం.. స్థానిక విశ్వకర్మ కాలనీకి చెందిన జంగం మణమ్మ కాలినడక సోమవారం మైనార్టీ గురుకుల పాఠశాల నుంచి లైన్‌గడ్డకు వెళ్తుంది. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలో బంగారం గొలుసు ఎత్తుకెళ్లాడని బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సామగ్రి చోరీ చేసిన నలుగురి అరెస్టు

తాండూర్: సింగరేణి సామగ్రిని చోరీ చేసిన నలుగురిని అరెస్టు చేసినట్లు సీఐ కుమారస్వామి తెలిపారు. తాండూర్ పోలీసు సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. మందమర్రికి చెందిన మోతే రాజయ్య, మోతే నర్సయ్య, తిరుపతి, మధు గ్రామాల్లో సబ్బులు, సర్ఫ్‌లు అమ్ముకుంటూ జీవనం సాగించేవారు. గతనెల 8న గోలేటి వర్క్‌షాప్ ఏరియా స్టోర్స్‌లో సింగరేణి అధికారులు భద్రపర్చిన రూ.6.22 లక్షల విలువైన ఇత్తడి పరికరాలను ఎత్తుకెళ్లారు. ఇత్తడిని కరిగించి ముద్దగా చేశారు. అధికారులు ఇచ్చిన వీడియోలు, ఇతర ఆధారాలతో దర్యాప్తు చేసి నిందితులను గుర్తించారు. సోమవారం ఆ నలుగురు రెండు బైక్‌లపై మందమర్రి నుంచి తాండూర్ వైపు వెళ్తుండగా పెట్రోల్ బంక్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి ఇత్తడి ముద్దలు, రెండు బైక్‌లు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. చాకచక్యంగా నిందితులను పట్టుకున్న పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు. సమావేశంలో మాదారం ఎస్సై సౌజన్య పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో మెరిశారు..

- ప్రతిభ కనబర్చిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు
- పతకాలతో సత్తాచాటుతూ..
- అంతర్జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం

వారందరిది నిరుపేద కుటుంబ నేపథ్యం. అయినప్పటికీ భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలని చదువును కొనసాగిస్తూనే క్రీడారంగాన్ని ఎంచుకున్నారు. అథ్లెటిక్స్‌లో నిరంతరం సాధన చేసి ప్రతిభ కనబరుస్తున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు సత్తా చాటి పతకాలు సాధిస్తున్నారు. అంతర్జాతీయ పోటీలకు దేశం తరుపున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గత నెల 18, 19వ తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో 11వ తెలంగాణ రాష్ట్ర యూత్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లోనూ ప్రతిభ కనబర్చారు. ఉమ్మడి జిల్లా క్రీడాకారులపై ప్రత్యేక కథనం.

– ఆదిలాబాద్



రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

ఎన్ఐఎస్ శిక్షకుడినవుతా



బజార్‌హత్నూర్ మండలం మంజారం తండాకు చెందిన గురుదయాల్ సింగ్‌-శారద బాయి దంపతుల కుమారుడు అజాడే అనిల్. ఆదిలాబాద్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ సెకండియర్ చదువుతున్నాడు. ఈయన అథ్లెటిక్స్‌లో హేమర్ త్రో, స్టీపుల్ చేజ్, ట్రిపుల్ జంప్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తున్నాడు. 2019 పూణెలో జరిగిన స్విమ్మింగ్ జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. ఇటీవల రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఒక వెండి, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నాడు. అంతర్జాతీయ పోటీల్లో విజేతగా నిలవడమే కాకుండా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ కోచ్‌గా వ్యవహరించడమే తన లక్ష్యమని, ఇందుకోసం శిక్షకులు వీజీఎస్ రాకేశ్, వీజీఎస్ జోల పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్నా.

గ్రూప్‌-1 ఆఫీసర్ కావడమే లక్ష్యం..



ఆదిలాబాద్‌కు చెందిన ప్రవీణ్‌-గీత దంపతుల కుమారుడు డి.చంద్రసిద్ధార్థ.. ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. ఐదో తరగతి నుంచే ఆటలపై మక్కువ పెంచుకుని, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణిస్తున్నాడు. అథ్లెటిక్స్‌లో రేస్‌వాక్ ఈవెంట్లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కాంస్య పతకం గెలుపొందాడు. 2022లో జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించాడు. గతేడాది డిసెంబర్‌లో జరిగిన ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో ఉత్తీర్ణత సాధించాడు. సైనికుడిగా విధులు నిర్వర్తిస్తూనే, తన చిన్ననాటి కల అయిన గ్రూప్‌-1 ఆఫీసర్ కావడమే లక్ష్యంగా సన్నద్ధమవుతున్నాడు.

అంతర్జాతీయ స్థాయిలో మెరిశాడు



ఇచ్చోడ మండలం దేవుల్ నాయక్ తండాకు చెందిన రమేశ్ రాథోడ్‌-లక్ష్మీబాయి దంపతులకు కుమారుడు రాథోడ్ వంశీ. గతేడాది జూలైలో నేపాల్‌లో జరిగిన టార్గెట్ బాల్‌పోటీల్లో దేశం తరపున ప్రాతినిధ్యం వహించాడు. ఇందులో భారత్ రెండో స్థానంలో నిలువగా, వెండి పతకం నిలబెట్టుకున్నాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో హామర్ త్రో ఈవెంట్లో రెండుసార్లు రజత పతకాలు సాధించగా, ఓసారి కాంస్య పతకంతో విజేతగా నిలిచాడు. కాకతీయ విశ్వవిద్యాలయ యూనివర్సిటీ స్థాయి పోటీల్లో బ్యాడ్మింటన్ క్రీడలో ప్రాతినిధ్యం వహించి రాణించాడు. వ్యాయామ ఉపాధ్యాయుడిగా కావడమే లక్ష్యంగా ప్రతీరోజు నాలుగు గంటలు మైదానంలో శ్రమిస్తున్నాడు.

శిక్షకుల ప్రోత్సాహంతోనే..



బేల మండలం సిర్సన్నకు చెందిన ఎస్కే ఫిరోజ్‌- షరీఫా దంపతుల కుమార్తె ముస్కాన్. అథ్లెటిక్స్ పోటీల్లో విజేతగా నిలుస్తోంది. ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీలో డీ.పెడ్ కోర్సు చేస్తున్న ఆమె హ్యామర్‌త్రో ఈవెంట్‌లో మూడు పతకాలు సాధించింది. హైదరాబాద్, హన్మకొండలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణం, రజతం, ఉస్మానియా యూనివర్సిటీ స్థాయిలో కాంస్య పతకాలతో మెరిసింది. శిక్షకులు రేణుక, వీజీఎస్ రాకేశ్ ప్రోత్సాహంతో రాగలిగింది. జాతీయ అథ్లెటిక్స్ శిక్షకురాలిగా ఎదగాలన్నదే తన లక్ష్యమని చెబుతోంది.

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగమే లక్ష్యం



నిర్మల్ జిల్లా చిట్యాలకు చెందిన రాజు-సరోజ దంపతుల కుమార్తె దివిటి అరుణ. రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పతకాల పంట పండిస్తోంది. ప్రస్తుతం ఆదిలాబాద్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ (ఎంపీసీఎస్) సెకండియర్ చదువుతోంది. రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో హ్యామర్ త్రో, డిస్కస్ త్రో ఈవెంట్లలో మొత్తం ఐదు పతకాలు సాధించింది. హ్యామర్ త్రోలో రెండు రజతం, 2 కాంస్య, డిస్కస్ త్రోలో కాంస్య పతకాలు సొంతం చేసుకుంది. భవిష్యత్తులో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధిస్తానని ధీమాగా చెబుతోంది.

వ్యాయామ ఉపాధ్యాయురాలవుతాను



నిర్మల్ జిల్లా కుంటాల మండలం అంబకంటి గ్రామానికి చెందిన చిన్నయ్య-చిన్నక్క దంపతుల కుమార్తె సీహెచ్. వసంత. రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటుతోంది. పోటీల్లోని ట్రిపుల్ జంప్, హ్యామర్ త్రో ఈవెంట్లలో ఇప్పటివరకు 8 పతకాలు సాధించింది. యూనివర్సిటీ లెవల్లో హ్యామర్ త్రో ఈవెంట్లో కాంస్య పతకంతో సత్తా చాటింది. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో బీకాం చదువుతున్న ఆమె వ్యాయామ ఉపాధ్యాయురాలిగా కెరియర్ ఎంచుకుంటా అంటోంది.

సౌత్ ఏషియన్ పోటీల్లో కాంస్యం



నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం సాత్గాం గ్రామానికి చెందిన బి.గౌరి అంతర్జాతీయ టార్గెట్ బాల్ పోటీల్లో దేశం తరపున ప్రాతినిధ్యం వహించింది. గతేడాది జూలైలో నేపాల్ రాజధాని ఖాట్మండులో జరిగిన మొదటి సౌత్ ఏషియన్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంది. ఈ పోటీల్లో భారత జట్టు తృతీయ స్థానం సాధించగా, ఆమె కాంస్య పతకం గెలుచుకుంది. శిక్షకుల ప్రోత్సాహంతో మరిన్ని క్రీడా పోటీల్లో రాణిస్తానని చెబుతోంది.

నాలుగు గంటల సాధన



నిర్మల్ జిల్లా ముధోల్ మండలం అష్ట గ్రామానికి చెందిన రాజశేఖర్-సుగుణ దంపతుల కుమార్తె బి.స్వాతి. అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరుస్తోంది. ఇప్పటి వరకు స్టీపుల్ చేజ్, జావెలిన్ త్రో ఈవెంట్లలో రెండు పతకాలతో మెరిసింది. ఇప్పటివరకు ఒక రజతం, ఒక కాంస్య పతకంతో సత్తా చాటింది. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం నాలుగు గంటలు సాధన చేస్తున్నానని చెబుతోంది. మరిన్ని క్రీడా ఈవెంట్లలో సత్తా చాటడానికి, నిరంతరం క్రీడా నైపుణ్యాలు అలవర్చుకుంటానని తెలుపుతోంది.

అన్నిరంగాల్లో మహిళల పాత్ర కీలకం



మహిళా ఉద్యోగులకు లంచ్‌బాక్స్ అందిస్తున్న ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: అన్నిరంగాల్లో మహిళల పాత్ర కీలకమని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐటీడీఏ మహిళా ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు..ముఖ్యమంత్రులు, మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, శాస్త్రవేత్తలుగా రాణిస్తున్నారని తెలిపారు. అనంతరం మహిళా ఉద్యోగులకు లంచ్ బాక్స్‌లు అందజేశారు.

నారీశక్తి పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు, అతిథులు

నిర్మల్‌ఖిల్లా: అన్నిరంగాల్లో మహిళలు రాణించడం శుభ పరిణామమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో సోమవారం 'పాటే మా ప్రాణం'సంగీత అకాడమీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి 'నారీశక్తి పురస్కారాలు ప్రదానం చేశారు. డాక్టర్లు రజిని, చంద్రిక, న్యాయవాది నివేదిత, సుగుణ, ఎస్సై రోహిణి, ఎఫ్ఆర్వో శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి రాణి, కేజీబీవీ ఎస్ఓ లతాదేవి, విజయలక్ష్మి, స్వాతి, లక్ష్మి, శ్రీలత, రాజ్యలక్ష్మి పురస్కార గ్రహీతలు ఉన్నారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ ముత్యం రెడ్డి, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న, ప్రముఖవైద్యులు యు.కృష్ణంరాజు, సంగీత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ నవ్య, కార్యదర్శి శ్రీకాంత్ సభ్యులు వాణిశ్రీ, కవిత, మమత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



గణేశ్ (ఫైల్)

నేరడిగొండ: మండలంలోని బోరిగాం బస్టాండ్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన బొడిగే గణేశ్ (26) ఆదివారం రాత్రి నిర్మల్‌లో ఉంటున్న ఆయన భార్య వద్దకు బైక్‌పై వెళ్తున్నాడు. గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలై సంఘటన స్థలంలో మృతిచెందాడు. మృతదేహాన్ని బోథ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సోమవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్య కోసం వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబీకులు కన్నీటిపర్యంతమయ్యారు.

గోడ మీదపడి కూలీ..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై చంద్రశేఖర్

రెబ్బెన: మండలంలోని నవేగాంలో కూలీపై గోడ పడి మృతి చెందినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నవేగాం గ్రామానికి చెందిన కొద్దెన లస్మయ్య కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. గ్రామానికి చెందిన బొల్లు తిరుపతి ఇంటి పనుల కోసం సోమవారం లస్మయ్యను కూలీని పిలిచారు. పని నిమగ్నమై ఉన్న సమయంలో ఒక్కసారిగా లస్మయ్యపై గోడ కూలి పడటంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే కాగజ్‌నగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి అన్న రాజయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు కుంటలో పడి ఒకరు..

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని బోయవాడ కాలనీకి చెందిన పిండి విజయ్ (36) ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందాడు. ఎస్సై మనోహర్ కథనం ప్రకారం.. విజయ్ ఇంటి అవసరం నిమిత్తం కట్టెలు ఏరేందుకు మండలంలోని కామాయిపేట అటవీ ప్రాంతానికి ఆదివారం వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో దాహం వేయగా గ్రామ సమీపంలోని కుంటలో నీరు తాగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోయాడు. ఆదివారం రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. సోమవారం కుంట వద్ద చెప్పులు చూసి గ్రామస్తులు పోలీసులకు సమాచారమివ్వడంతో స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పదంగా యువకుడు..

ఆదిలాబాద్‌రూరల్: మావల శివారు ప్రాంతంలో గల ఎర్రకుంటలో ఒకరు అనుమానాస్పదంగా మృతిచెందారు. పోలీసుల కథనం ప్రకారం.. మావల గ్రామానికి చెందిన షేక్ ఫర్వేజ్ అదే గ్రామంలోని పెట్రోల్ పంపులో ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి రాలేదు. కుటుంబ సభ్యులు రాత్రి వరకు గాలించిన ఆచూకీ దొరకలేదు. సోమవారం ఉదయం ఎర్రకుంట ప్రాంతం వైపు వెళ్లిన మావలకు చెందిన సతీశ్.. మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిధర్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. కుమారుడి మృతిపై అనుమానం ఉందని తల్లి రెహానా ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శాశ్వత నిద్రలోకి..

- ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని మృతి
- ఇచ్చోడలో ఘటన



లాలిత్య(ఫైల్)

ఇచ్చోడ/బోథ్/నార్నూర్/ఉట్నూర్‌రూరల్: ఏమైందో ఏమో కాని నిద్రలోనే ఆ విద్యార్థి తిరిగి రాని లోకాలకు చేరింది. ఈ ఘటన ఇచ్చోడ మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బజార్‌హత్నూర్ మండలం మొర్కండి గ్రామానికి చెందిన చిక్రం లాలిత్య (14) పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతుంది. ఆదివారం రాత్రి భోజనం అనంతరం తోటి విద్యార్థులతో కలిసి మొదటి అంతస్తులో నిద్రకు ఉపక్రమించింది. సోమవారం ఉదయం 6 గంటలకు విద్యార్థులంతా నిద్రలేచారు. ఆమె మాత్రం పడుకుని ఉండగా స్నేహితులు వచ్చి లేపేందుకు యత్నించగా స్పందించలేదు. నోటి నుంచి తెల్లటి నురుగు ఉండగా వెంటనే వసతి గృహ సిబ్బందికి తెలిపారు. హెచ్ఎం కాత్లె ఉత్తం దాస్ అక్కడికి చేరుకుని విద్యార్థినిని పరిశీలించి మృతిచెందినట్లుగా గుర్తించాడు. వెంటనే పోలీసులతోపాటు విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. విద్యార్థిని తల్లిదండ్రులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. గత ఆదివారమే తమ బిడ్డను కలిసివెళ్లినట్లు వారు విలపిస్తూ పేర్కొన్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ భీమేశ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించేందుకు యత్నించగా విద్యార్థిని తండ్రి రాజేశ్వర్ తమ బంధువులు వచ్చేంత వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని అడ్డుకున్నాడు. పక్కనే పరీక్షలకు సిద్ధమవుతున్న ఇంటర్ విద్యార్థులకు ఇబ్బందులు కలగచేయవద్దని సూచించి రాజేశ్వర్‌ను అక్కడి నుంచి మృతదేహం వెంట బోథ్‌కు తరలించారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల కోసం రూ.10 వేలు కుటుంబానికి అందించారు. ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే బాలిక మృతిచెందిందని ఆరోపించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. కాగా, విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరిపించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర సెక్రటరీ అన్నెల లక్ష్మణ్, విద్యార్థి సంఘాలు పాఠశాల ఎదుట, ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేపట్టాయి. ధర్మసమాజ్ పార్టీ, సీపీఐ నాయకులు ఆస్పత్రి ఎదుట బైఠాయించారు. ఈ విషయమై నాయకులు ఐటీడీఏ డీడీ వివరణ కోరగా, నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారన్నారు. మృతిపై విచారణ చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తాకు ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్రం నగేశ్ వినతిపత్రం అందించారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు సోమగూడెం క్రీడాకారుడు



ఎంపికైన శంకర్‌తో కోచ్ శేఖర్

కాసిపేట: జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు సోమగూడెంకు చెందిన గురునాథం శంకర్ ఎంపికయ్యాడని కోచ్ బాదె శేఖర్ తెలిపారు. నవంబర్ 25, 26, 27 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. మణిపూర్‌లోని ఇంఫాల్‌లో ఏప్రిల్ 15 నుంచి 21వరకు జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొంటాడని తెలిపారు.

గ్రూప్‌-1 ఫలితాల్లో ప్రతిభ



సచిన్‌రెడ్డి



కార్తీక్‌రెడ్డి



అశోక్



లావణ్యరెడ్డి

తాంసి: గ్రూప్‌-1 ఫలితాలను టీజీపీఎస్సీ సోమవారం విడుదల చేసింది. ఇందులో పలువురుయువకులు ప్రతిభ కనబర్చారు. కొందరు ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నవారు ఉన్నారు. పరీక్ష రాసి ఉత్తమ మార్కులు సాధించారు. తాంసి మండలంలోని బండల్‌నాగాపూర్‌కు చెందిన సురుకుంటి సచిన్.. 454.5 మార్కులు సాధించాడు. ఈయన వార్డు ఆఫీసర్‌గా ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నాడు. భీంపూర్ మండలం కరంజి(టి) గ్రామానికి చెందిన ఎల్టి కార్తీక్‌రెడ్డి..443 మార్కులు సాధించాడు. బోథ్ మండలం ధనోర గ్రామానికి చెందిన నల్ల లావణ్యరెడ్డి..తాంసి మండలం హస్నాపూర్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తోంది. ఓ వైపు విధులు నిర్వహిస్తూనే గ్రూప్‌-1 పరీక్ష రాయగా 441.5 మార్కులు సాధించింది. తాంసికి చెందిన జానకొండ అశోక్ పంచాయతీ కార్యదర్శిగా జైనథ్ మండలం సుందరగిరిలో విధులు నిర్వర్తిస్తూనే గ్రూప్‌-1 పరీక్ష రాశాడు. 398.50 మార్కులు సాధించాడు.

బాడీబిల్డింగ్ ఓవరాల్ చాంపియన్ వెంకటేశ్



చాంపియన్‌గా నిలిచిన వెంకటేశ్‌ను అభినందిస్తున్న నిర్వాహకులు, బాడీ బిల్డర్లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాడీబిల్డింగ్ ఓవరాల్ చాంపియన్‌గా మంచిర్యాల జిల్లా పాత మంచిర్యాలకు చెందిన మాసు వెంకటేశ్ నిలిచాడు. సీసీసీలో తెలంగాణ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బాడీ బిల్డింగ్ జూనియర్, సీనియర్, మాస్టర్ డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన పలువురు బాడీ బిల్డర్లు పాల్గొన్నారు. మాసు వెంకటేశ్ అన్ని కేజీల విభాగాల్లో మంచిర్యాల జిల్లా చాంపియన్‌గా నిలిచాడు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన చాంపియన్ ఆఫ్ ద చాంపియన్ పోటీల్లోనూ విజేతగా నిలిచాడు.

అ'పూర్వ' సమ్మేళనం

బెల్లంపల్లి: బెల్లంపల్లి శాంతిఖని బస్తీ ప్రభుత్వ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో 1988-89 బ్యాచ్ ఏడో తరగతి పూర్వవిద్యార్థులు సోమవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. గురువులు, పూర్వ విద్యార్థులు కృష్ణకుమార్, వెంకటస్వామి, వాసు, వెంకటేశ్, సత్యం, రాజు, శ్రీశైలం, రాజేశ్వరి, సునీత పాల్గొన్నారు.



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు